www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 24 ఆగస్టు 2023



జగనన్న కాలనీలో సబ్ స్టేషన్ ట్రయల్ రన్

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట జి.రాగంపేట రోడ్డులో ఇటిసి లేఅవుట్‌లో గల జగనన్న కాలనీకి విద్యుత్ సరఫరా చేసేందుకు నూతనంగా నిర్మించిన 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ ట్రైల్‌రన్‌ను డిఇ ప్రభాకర్, ఎఇ రమేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సామర్లకోటలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమానికి త్వరలో ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో కాలనీలో మౌలిక వసతులను కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సబ్‌స్టేషన్ ట్రైల్ రన్‌ను నిర్వహించారు. ఈ సబ్ స్టేషన్ ద్వారా త్వరలో కాలనీలో ఉన్న ప్రజలకు విద్యుత్ సరఫరాను అందిస్తామని డిఇ తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ ఊబా లక్ష్మణరావు, పలువురు లన్‌మెన్‌లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్య కారక పరిశ్రమలు వద్దు

- కాకినాడ కోరమాండల్ ఎరువుల పరిశ్రమ విస్తరణపై భిన్నాభిప్రాయాలు
- ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులకు దక్కని అవకాశం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, కాకినాడ రూరల్

కాలుష్యం వెదజల్లే పరిశ్రమల వల్ల జ్రలు తీవ్ర అనారోగ్యాలకు గురై ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, ఈ నేపథ్యంలో ఆయా పరిశ్రమలు పర్యావరణాన్ని కాపాడుతూ కాలుష్యం లేని విధంగా పక్కాగా చర్యలు తీసుకొని కార్యకలాపాలు సాగించాలని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. కాకినాడ రూరల్ వాకలపూడిలో ఉన్న కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎరువుల పరిశ్రమ విస్తరణపై బుధవారం పరిశ్రమ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణను కలెక్టర్ కృతికాశుక్లా అధ్యక్షతన నిర్వహించారు. 39 మంది నేరుగా, 50 మంది లిఖిత పూర్వకంగా అభిప్రాయాలను వెల్లడించారు. కాలుష్యాన్ని తెచ్చిపెట్టే విధంగా విస్తరిస్తే మాత్రం తాము వ్యతిరేకిస్తామని వివిధ సంఘాల నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సుమారు 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ముఖ్యమంత్రి మీటింగును తలపించేలా పోలీసులు మోహరించి ఆంక్షలు విధించడంతో పలువురు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అయితే పరిశ్రమ ప్రభావిత గ్రామాలకు చెందిన స్థానికులకు అంతగా అవకాశం ఇవ్వకపోవడంతో యాజమాన్యంపై అనేక విమర్శలు వినిపించాయి.

తొలుత కలెక్టర్ మాట్లాడుతూ కోరమాండల్ సంస్థ ప్రస్తుతం ఏడాదికి 20.50 లక్షల టన్నుల ఎరువులను ఉత్పత్తి చేస్తుందన్నారు. పరిశ్రమను 30 లక్షల టన్నులకు పెంచాలనే ఆలోచనతో సంస్థ ఉందన్నారు. కొత్తగా ఏడాదికి 30 వేల కిలోలీటర్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన నానో యూరియా, డిఎపి ఎరువులు ఉత్పత్తి చేయాలని భావిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో జరగనున్న ప్రజాభిప్రాయాలను రికార్డు చేసి పరిశ్రమ విస్తరణ అనుమతుల కోసం కేంద్రానికి నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అభిప్రాయాలను వెల్లడించిన ప్రతి ఒక్కరి సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకుంటామన్నారు.

ఈ సందర్భంగా కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు మాట్లాడుతూ కోరమాండల్ పరిశ్రమ కాలుష్యంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాలన్నారు. కాలుష్యం లేకుండా పరిశ్రమ విస్తరణ జరిగితే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 75 శాతం స్థానికులకే ఉద్యోగావకాశాలు ఇవ్వాలని, సిఎస్ఆర్ నిధులను చుట్టుపక్కల గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేయాలని కోరారు. కాకినాడ ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ప్రజా అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడంతో పాటు కార్మికుల భద్రతపై దృష్టి పెట్టాలన్నారు. సిఎస్ఆర్ నిధులను చుట్టుపక్కల గ్రామాల అభివద్ధికి మాత్రమే ఖర్చు చేసేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

సిఐటియు జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, మండల నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, ఎఐటియుసి జిల్లా నాయకుడు తోకల ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ పరిశ్రమ విస్తరణను స్వాగతిస్తున్నామన్నారు. అయితే కాలుష్యం లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని కోరారు. స్థానికులకే ఉపాధి అవకాశాలు దక్కేలా చూడాలని, విద్యా, వైద్య సదుపాయాలతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాభిప్రాయ సేకరణ చేసి ముందుకు సాగాలన్నారు. అయితే ఈ కార్యక్రమానికి వస్తున్న సందర్భంలో పోలీసులు ఆంక్షలు విధించడం సరికాదన్నారు. మత్స్యకారుల జీవన విధానానికి ఎటువంటి నష్టం కలగకుండా చూడాలన్నారు. ప్రమాదకర పరిశ్రమలకు మాత్రమే తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు. పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ పరిశ్రమ ఆవరణలో కార్యక్రమం చేపట్టడం సరికాదన్నారు. కిరాయి జనాన్ని తీసుకొచ్చి అధికారేతర రాజకీయ పార్టీల ప్రతినిధులను,ప్రజా సంఘాల నాయకులను నగర పెద్దలను వెనక్కు నెట్టి అవమానించారన్నారు. గ్రీన్ బెల్ట్ వృద్ధితోనే కోరమాండల్ విస్తరణకు నగర ప్రజలు సహకరిస్తారన్నారన్నారు.

ప్రజా సంఘాల నాయకుడు గదులు సాయిబాబా మాట్లాడుతూ దొడ్డ దారిన ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. కొంతమంది ట్రేడ్ యూనియన్ నాయకులను పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి అభివృద్ధి అంటే ఎలా? అని ప్రశ్నించారు. కాలుష్యం లేదని యాజమాన్యం స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలకు నష్టం కలిగించే పనులకు వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. వాకలపూడి మాజీ సర్పంచ్ గింజల శ్రీనివాసరావు మాట్లాడుతూ కోరమాండల్ అనుకున్న స్థాయిలో గ్రీన్ బెల్ట్ నిర్వహించట్లేదన్నారు. పర్యావరణ ప్రేమికుడు జేటి రామారావు మాట్లాడుతూ పరిశ్రమ విస్తరణ తదితర అంశాలపై ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎందుకు వివరించలేకపోయారని ప్రశ్నించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను కనీసంగా ఉదహరించకపోవడం తగదన్నారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని కోరారు.

వలస పాకల గ్రామానికి చెందిన కెమికల్ ఇంజినీర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అర్ధరాత్రి 2 గంటల నుంచి తెల్లవారుజాము 5 గంటల వరకు వివిధ పరిశ్రమల నుంచి విషవాయువులు వెలువడుతున్నాయన్నారు. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. ప్రమాదకర వ్యాధులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విషవాయువులను అదుపు చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎరువులు పరిశ్రమల యాజమాన్యం, కాకినాడ ఆర్‌డిఒ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు సిపిఎం అభినందన

ప్రజాశక్తి - కాకినాడ

చంద్రుడిపై చంద్రయాన్-3 రోవర్ ల్యాండింగ్‌ను విజయవంతంగా నిర్వహించిన ఇస్రో శాస్త్రవేత్తలకు సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ ఒక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ఇలాంటి అనేక ప్రయోగాల్ని నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మూఢనమ్మకాల నుంచి భారత సమాజాన్ని అభ్యుదయ సమాజంగా, అభివృద్ధికర సమాజంగా మార్చడంలో శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించే శాస్త్రవేత్తల కృషి ఎనలేనిదని ఆయన ప్రశంసించారు.

సిఐటియు అభినందన

చంద్రయాన్-3ను విజయవంతం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వ శేషాబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటలో అభినందనలు తెలిపారు. భారత ప్రభుత్వం ఇలాంటి శాస్త్ర ప్రయోగాలకు నిధులను కేటాయించాలని, పరిశోధనలపై జిఎస్‌టిని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మరిన్ని పరిశోధనాత్మక విశ్వవిద్యాలయాలను నెలకొల్పాలన్నారు. ఇవి మాత్రమే ప్రపంచం దేశాలముందు భారతదేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టగలవని తెలిపారు. నేటి ప్రయోగం విజయవంతం కావడం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది అన్నారు.

ఇస్రో చరిత్రలో మైలురాయి : ఎంఎల్ఎ పొన్నాడ



కేకు కట్ చేస్తున్న ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్

తాళ్లరేవు : ఇస్రో చరిత్రలో చంద్రయాన్-3 మైలురాయిగా నిలిచిపోతుందని ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ అన్నారు. పోలేకుర్రు పంచాయతీ వద్ద స్థానిక సర్పంచ్ వెంటపల్లి నూకరాజు ఆధ్వర్యంలో చంద్రయాన్-3 విజయవంతంపై కేక్ కట్ చేసి పంచారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీహరికోట నుంచి ఇస్రో చేసిన మూడో ప్రయోగం ద్వారా చంద్రునిపై విక్రం రోవర్ సేఫ్ లాండింగ్ చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

చంద్రయాన్ ప్రయోగాన్ని తిలకించిన విద్యార్థులు



చంద్రయాన్-3 ప్రయోగాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పెద్దాపురం

చంద్రయాన్ - 3 చంద్రుడిపై ల్యాండ్ అవుతున్న దశ్యాన్ని పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు తిలకించారు. బుధవారం జెవివి నాయకులు, చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక వరహాలయ్య పేటలోని యాసలపు సూర్యారావు భవనంలో ఏర్పాటు చేసిన ప్రొజెక్టర్ ద్వారా ఈ ప్రయోగాన్ని విద్యార్థులు తిలకించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ దీనికి సంబంధించిన ప్రతి అంశాన్ని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు.ఈ ప్రయోగం ద్వారా భారతదేశం అమెరికా, రష్యా, చైనా సరసన నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్‌కుమార్, సభ్యులు కె.రవికుమార్, అంజలి, సత్య, పూజిత తదితరులు పాల్గొన్నారు.



చైతన్యను సత్కరిస్తున్న దవులూరి దొరబాబు తదితరులు

గ్రూప్-1 విజేత చైతన్యకు అభినందన

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మొదటి ప్రయత్నంలోనే గ్రూప్-1 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఎంపిడిఒగా ఎంపికైన సామర్లకోటకు చెందిన తర్లంపూడి చైతన్యను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అభినందించారు. బుధవారం బలుసులపేటలోని చైతన్య స్వగహంలో జరిగిన అభినందన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చైతన్యకు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడారు. తర్లంపూడి కమల్ రాజ్ కుటుంబం తమకు ఎంతో ఆప్తులని, అటు వంటి సామాన్య కుటుంబంలో పుట్టి గ్రూప్‌లో విజయం సాధించడం గర్వకారణమన్నారు. మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. మరో ముఖ్యఅతిథి రాష్ట్ర కార్మిక సంఘ నాయకులు దవులూరి సుబ్బారావు మాట్లాడుతూ తల్లిదండ్రులు పెంపకంపైనే పిల్లల భవిష్యత్తు ఉంటుందన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేందుకు మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాడు-నేడు ద్వారా విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అనంతరం గ్రూప్-1 విజేత చైతన్య మాట్లాడుతూ తన తల్లిదండ్రుల ఆశీస్సులతోనే ఇంతటి విజయాన్ని సాధించానని తెలిపారు. ప్రజలకు సేవలు అందించే బాధ్యతతో ఉంటానన్నారు. తొలుత కుటుంబ సభ్యులతో కలిసి కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, కమిషనర్ జె.రామరావు, కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ, నేతల హరిబాబు, వారా పాప, చైతన్య తల్లితండ్రులు కమల్ రాజ్, వైసిపి నాయకుడు గంగిరెడ్డి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జెఎన్‌టియుకె వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకె అలూమినీ ఆడిటోరియంలో విశ్వవిద్యాలయ 15వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ కె.హేమచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విసి జివిఆర్.ప్రసాదరాజు అధ్యక్షత వహించారు. ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ విసి కె.పద్మరాజు, మాజీ విసిలు విఎస్ఎస్.కుమార్, ఎం.రామలింగరాజు, రెక్టార్ కెవి.రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఒఎస్‌డి డి.కోటేశ్వరరావులు అతిథులుగా హాజరయ్యారు. యుసిఐకె పూర్వ విద్యార్థి, తూర్పుగోదావరి జిల్లా సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు.



యశ్వంత్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న విసి, హేమచంద్రారెడ్డి

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ హేమచంద్రారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోని సాంకేతిక విద్యకు జెఎన్‌టియుకె, జెఎన్‌టియుఎ విశ్వవిద్యాలయాలు మూలస్తంభాలుగా నిలుస్తున్నాయన్నారు. ప్రస్తుత కాలంలో సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యారంగం, పరిశ్రమల మధ్య అంతరాన్ని పూరించాలన్నారు. అన్ని వనరులను వినియోగించుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. మరిన్ని పరిశోధనలు చేపట్టేలా చూడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలోని మొట్టమొదటి న్యాక్ ఎం గ్రేడ్ సాధించిన జెఎన్‌టియుకె యూనివర్శిటీ అధికారులను, అధ్యాపకులను, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

విసి జివిఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సహకారంతో విశ్వవిద్యాలయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కళాశాలలు మెరుగైన న్యాక్ గ్రేడ్ సాధించాలని సూచించారు. ఖేలో ఇండియా ప్రాజెక్ట్‌లో భాగంగా జెఎన్‌టియుకె స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ బృందం పరిశీలించిందన్నారు. దీనికి ఎంపీ గీత ఎనలేని కృషి చేశారన్నారు.

జెఎన్‌టియుకె పూర్వ విద్యార్థి, తూర్పు గోదావరి జిల్లా సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. సివిల్స్, గేట్, క్యాట్, జిఆర్ తదితర పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం యశ్వంత్‌కుమార్‌రెడ్డికి యంగ్ అచీవర్ అవార్డును అందించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అతిథులు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, యుసిఇకె, యుసిఇఎన్ ప్రిన్సిపల్స్, వైస్ ప్రిన్సిపల్స్, స్పెషల్ ఆఫీసర్లు, అధ్యాపకులు, అనుబంధ కళాశాలల ప్రిన్సిపల్స్, యాజమాన్యాలు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్ రాజకీయ వ్యాపారి

ప్రజాశక్తి - కోటనందూరు

ముఖ్యమంత్రి జగన్ ఒక రాజకీయ వ్యాపారి అని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి యనమల కృష్ణుడు అన్నారు. బుధవారం కాకరపల్లిలో వాసం నాగేశ్వరరావు, సామినేడి కృష్ణార్జున ఆధ్వర్యంలో 'మీ ఇంటికి మీ దివ్య' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి తుని నియోజకవర్గ ఇన్‌ఛార్జి యనమల దివ్య మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పేదలకు ,పెత్తందారులకు యుద్ధం జరుగుతుందని చెబుతున్న జగనే పెత్తందారునిలా వ్యవహరిస్తున్నారన్నారు. , గతంలో ఎన్నడూ లేనంతగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. పెట్రో ధరలతో సామాన్యుల నడ్డి విరుస్తున్నారన్నారు. సంక్షేమం ముసుగులో ప్రజాధనాన్ని జగన్ దోచుకుంటున్నారన్నారు. ఇళ్ల స్థలాల పేరుతో నివాసయోగ్యం కాని స్థలాలను అధిక ధరకు కొనుగోలు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. టిడిపి మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గాడి రాజబాబు, ఎం.వెంకటేష్, యనమల శివరామకృష్ణ, అంకమరెడ్డి రమేష్, అంకుమరెడ్డి బుల్లిబాబు, నెమ్మది సత్యనారాయణ, గంట అమ్మాజీ, దంతులూరి చిరంజీవిరాజు, లెక్కల భాస్కర్, లగుడు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ పర్వత

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్రప్రసాద్ బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఎర్రవరంలో రూ.15 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డు, డ్రెయిన్లు, ఏలేరు కాలువ స్నాన ఘట్టాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న హార్టికల్చర్ భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. పెద్దనాపల్లిలో కాలువల పూడికతీత పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు నీరుకొండ రామకుమారి, సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, వైసిపి సీనియర్ నాయకులు నీరుకొండ సత్యనారాయణ, అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి రాజన్ రాజేంద్ర ఉన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాడుతాం

యు.కొత్తపల్లి : పేదలకు ఇళ్ల స్థలాలు కల్పించే వరకు పోరాటం ఆగదని సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా సిపిఐ నిరవధిక నిరాహార దీక్షను చేపట్టారు. ఈ దీక్షా శిబిరంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, పిఠాపురం నియోజవర్గ నాయకులు కేశవరపు అప్పలరాజు ఈ కార్యక్రమంలో పాల్గొని నిరవధిక దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ మండలంలో 1,200 మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయలేదన్నారు. తక్షణమే వారందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక అధికారులే కావాలని ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

ఆర్ఒ ప్లాంట్ ప్రారంభం

పెద్దాపురం : పాణంగిపల్లి చలపతిరావు అండ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్ఒ వాటర్ ప్లాంట్‌ను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ చలపతిరావు ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, తూతిక రాజు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మామిడి ఈశ్వరరావు, ఉమావతి, చల్లా బ్రహ్మాజీరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ సూర్యకుమారి, డాక్టర్లు అనుపమ, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ప్రభుత్వాసుపత్రిలో సేవలు మెరుగుపరచండి

పెద్దాపురం : స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బంది రోగులకు వైద్య సేవలు మెరుగుపరచాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చిన్న రాజప్ప అన్నారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక సంస్థలు, దాతల సాయంతో ఆసుపత్రిలో మరిన్ని సౌకర్యాల కల్పనకు కృషి చేయాలన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యకుమారి, డాక్టర్లు సతీష్, అనుపమ, శ్రీనివాస్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఈశ్వరరావు, ఉమావతి, చల్లా బ్రహ్మాజీరావు పాల్గొన్నారు.

ఘనంగా బోస్ పుట్టినరోజు వేడుక

ఏలేశ్వరం : కాకినాడ జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పైలా సుభాష్ చంద్రబోస్ పుట్టినరోజు వేడుకలు ఏలేశ్వరంలో అభిమానులు కార్యకర్తలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఏలేశ్వరం బాలాజీ చౌక్ సెంటర్లో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. అనంతరం మూడు వేల మందికి భోజన సదుపాయం కల్పించారు. పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు అభిమానులు కార్యకర్తలు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

కార్టూన్'నిజం'



టంగుటూరి జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని స్థానిక జడ్‌పి కార్యాలయ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ప్రకాశం విగ్రహానికి జెసి ఎస్.ఇలాక్కియా, శాసనమండలి సభ్యులు కర్రి పద్మశ్రీ, కాకినాడ అర్బన్ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కుడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న తదితరులు పూలమాలలు అలంకరించి నివాళులర్పించారు. ప్రకాశం సేవలను స్మరించుకున్నారు.

పెద్దాపురం : టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పెద్దాపురం పట్టణంలో ఘనంగా నిర్వహించారు.



సామర్లకోటలో టంగుటూరికి నివాళుర్పిస్తున్న అరుణ తదితరులు

ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ జె.సీతారామారావు ఆధ్వర్యంలో ప్రకాశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జె.సురేంద్ర, చైర్మన్ బొడ్డు తులసిమంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్ కనకాల మహాలక్ష్మి, స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు, హెచ్‌ఎం ఎంఎల్.శివజ్యోతి ఆధ్వర్యంలో టంగు టూరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తాళ్లరేవులో తోటపేట అంబేద్కర్ విగ్రహం వద్ద టంగుటూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి జ్యోతి సుధ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్ పాల్గొన్నారు. ప్రకాశం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ఎంపటిసి సభ్యులు బల్ల సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ, వైసిపినాయకులు డి.కొండ, డి.బాలరాజు, బి.సత్యనారాయణ, డి.గణేశ్వరావు, ఆర్.భద్రరావు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కాకినాడలో ప్రకాశం విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జెసి

సామర్లకోట రూరల్ : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం 152వ జయంతిని సామర్లకోటలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ ప్రకాశం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో కార్యాలయం ఎఒ విప్పర్తి వీర సాయిబాబా ఆధ్వర్యంలో సిబ్బంది, ఉద్యోగులు ప్రకాశం చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని అన్నదేవరపేటలో ఈనెల 17న జరిగిన చోరీ కేసులో ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్ఐ కెవి.రమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు అన్నదేవరపేట గ్రామానికి చెందిన జాలే బంగారాజు ఇంట్లో బంగారు నగలు, నగదు చోరీకి గురైంది. ఈ మేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోది చేసి దర్యాప్తు చేపట్టారు. అదే గ్రామానికి చెందిన బాలగంగాధర్ ఆకాశపు సతీష్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వీరి నుంచి రూ.లక్ష విలువ చేసే బంగారు నగరలు, రూ.70వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కొవ్వూరు కోర్టుకు తరలించామన్నారు.

కోడిపందెం ఆడుతున్న ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలో పేరవరం శివారు కోడిపందేలు ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ బివై.కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... పోలీసులకు సమాచారం అందడంతో బుధవారం సిబ్బందితో కలిసి ఎస్ఐ పేరవరంలోని కోడిపందేలా శిబిరంపై దాడి చేశారు. ముగ్గురిని అరెస్టు చేవారు. వారి నుంచి రూ.1,090 నగదు, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

విద్యుత్ ఉద్యోగి చేతివాటంపై విచారణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపాలిటీ జి.రాగంపేట రోడ్డులోని జగనన్న లే అవుట్‌లో జగనన్న ఇళ్లకు కరెంట్ కనెక్షన్లు ఇవ్వడంలో విద్యుత్ శాఖకు చెందిన ఉద్యోగి చేతివాటం ప్రదర్శించాడు. విద్యుత్ కనెక్షన్ల విషయంలో పలు అవకతవకలకు పాల్పడినట్టు అధికారులకు ఫిర్యాదులందాయి. లబ్ధిదారులకు ఎటువంటి డిపాజిట్ లేకుండానే విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టినా అందుకు విరుద్ధంగా సామర్లకోటలో విద్యుత్ శాఖ ఉద్యోగి విద్యుత్ కనెక్షన్ కోసం లబ్ధిదారుల నుంచి రూ.వేయి చొప్పున వసూలు చేశారు. లబ్ధిదారుల ఫిర్యాదు మేరకు విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. లబ్దిదారుల నుంచి వివరాలు సేకరించారు. నివేదికలో సదరు ఉద్యోగికి పెద్ద మొత్తంలో ఫోన్ పేల ద్వారా సొమ్ములు చెల్లించినట్లు గుర్తించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించి సంబంధిత ఉద్యోగిపై తదుపరి చర్యలకు సిఫార్సు చేయనున్నట్టు సమాచారం.

ఇథనాల్ ప్యాక్టరీపై సుమోటో కేసు

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని గుమ్మళ్లదొడ్డలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీపై సుమోటో కేసు నమోదు చేశారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మరోతి శివగణేష్ తెలిపారు. గోకవరం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. నియోజవర్గంలో కాలుష్యాలు నుంచి ప్రజలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ పోరాట యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుమ్మళ్లదొడ్డిలో ఏర్పాటు చేసే అసాగో ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల 30 నుంచి 50 కిలో మీటర్ల పరిధిలో భూగర్భ జలాలు, ప్రాణ వాయువు కలుషితమవుతుందన్నారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో 281/2023, 98/2023 నుంబర్లతో కేసు నమోదైందన్నారు. కార్పొరేట్ యాజమాన్యాలతో పోరాడే శక్తి ప్రజలే అందించాలని నియోజక వర్గంలో ప్రతి కుటుంబం నుంచి ఒక్కరు నెలలో ఒక్క రోజు పని దినాన్ని కాంగ్రెస్ పార్టీ పర్యావరణ పరిరక్షణ పోరాట యాత్ర కోసం కేటాయించాలని అభ్యర్థించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

మహిళా సంక్షేమమే టిడిపి లక్ష్యం

ప్రజాశక్తి - పెదపూడి

మహిళా సంక్షేమమే టిడిపి లక్ష్యమని, మహానాడులో ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందుతుందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అనపర్తి నియోజకవర్గ మహిళా అధ్యక్షులు జుత్తుక సూర్యకుమారి అధ్యక్షతన రాజుపాలెంలో జరిగిన మహాశక్తి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటా తిరిగి మినీ మేనిఫేస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ సంక్షేమం పేరుతో దోపిడీ చేస్తుందన్నారు. అసలైన సంక్షేమం టిడిపితోనే సాధ్యమని వెల్లడించారు. ప్రత్యేకించి మహిళలకు మహాశక్తి పేరుతో అనేక సంక్షేమ పథకాలను చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి బేరా వేణమ్మ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు శేషారత్నం, మండల అధ్యక్షులు సత్యవతి, డ్వాక్రా, అంగన్‌వాడీ సాధికారిక కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుభాషిణి, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టా గంగాధరచౌదరి, టిడిపి మండల అధ్యక్షులు జుత్తుక కృష్ణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు,

ప్రశాంతంగా మండల సమావేశం

ప్రజాశక్తి- రౌతులపూడి

రౌతులపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రశాంతంగా సాగింది. ఎంపిపి గంటిమల రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఎంపిడిఒ గోవింద్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఈ సమావేవాన్ని నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పనుల పురోగతిని సభ దృష్టికి తీసుకొచ్చారు. తొలుత ఎఒ ఈశ్వరరావు మాట్లాడుతూ వర్షభావ పరిస్థితుల నేపథ్యంలో మండలంలో వరి సాగు చేపట్టే పరిస్థితి లేదన్నారు. రైతులకు 50 శాతం సబ్సిడీపై అపరాలు అందజేసేందుకు ప్రణాళికలు చేపడుతున్నామని తెలిపారు. ఎంఇఒ అడిగర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ నాడు-నేడు పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ ఇంటింటికీ తాగునీరు అందించేందుకు జల్‌జీవన్ పనులను ముమ్మరం చేశామన్నారు. విద్యుత్ శాఖ అధికారి వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాల్లో లో వోల్టేజ్ సమస్య ఉందని, దీన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామనానరు. అలాగే పలు శాఖల అధికారులు పనుల వివరాలను సభ సభ దృష్టికి తీసుకొచ్చారు

హత్య కేసు కొట్టివేతపై ఆందోళన

కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పిఠాపురం రూరల్ విరవాడలో 2012లో పట్టపగలు రాజకీయ కారణాలతో జరిగిన జంట హత్య కేసులో సాక్షాధారాలు బలంగా ఉన్నప్పటికీ కేసును కొట్టివేయడంతో ఆగ్రహించిన మతుల బంధువులు బుధవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. కొందరు శరీరంపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాకినాడ డిఎస్‌పి మురళీకృష్ణారెడ్డి నచ్చజెప్పడంతో కొంత సేపటికి పరిస్థితులు సద్దుమణిగాయి. అడపా భీమరాజుర, పెదిరెడ్ల వెంకటేశ్వరరావు నాటి ఘటనలో హత్యకు గురైన విషయం విదితమే.



ఆవేదన వ్యక్తం చేస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

ఈ సందర్భంగా అడపా భీమరాజు కుమారుడు, ఎంపిటిసి సభ్యులు అడపా రఘు, పెదిరెడ్ల వేంకటేశ్వరరావు భార్య అచ్చివేణి తదితరులు ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. 2012 జూన్ 10న అప్పటి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమరాజును రాజకీయ వైరుధ్యాలు ఉన్న నేపథ్యంలో దారి కాసి హతమార్చడానికి ప్రయత్నించారు. అడ్డుకోబోయిన పెద్దిరెడ్ల వెంకటేశ్వరరావును, పోతుల వీరభద్రరావుపై అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేశారన్నారు. ఈ దాడిలో అడపా భీమరాజుతోపాటు పెద్దిరెడ్ల వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మరణించారన్నారు. పోతుల వీరభద్రరావు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరి ప్రాణాలతో బయటపడ్డారన్నారు. ఈ కేసును న్యాయమూర్తి కొట్టివేశారన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితునిగా ఉన్న కురాకుల పుల్లయ్య కేసు కొట్టివేసిన తర్వాత సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడంతో మృతుని బంధువులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. గాయాల పాలైన ప్రత్యక్ష సాక్షి పోతుల వీరభద్రరావు సాక్ష్యం చెప్పినా కేసు కొట్టి వేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులకు శిక్ష పడేలా చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



రోడ్డుపై బైటాయించిన ఆందోళనకారులు

ఘనంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలు

ప్రజాశక్తి - కాకినాడరూరల్

సెట్రాజ్ ఆధ్వర్యంలో ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్డులోని సత్యకళావాహినిలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక విభాగంలో జానపద నత్యం(గ్రూపు, సోలో), జానపద గేయాలు(గ్రూపు, సోలో), జీవన నైపుణ్యంలో కథా రచన, పోస్టర్ తయారీ, ఫోటోగ్రఫీ, ఉపన్యాసం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. జెసి ఎస్.ఇలాక్కియా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సెట్రాజ్ సిఇఒ కె.శ్రీరమణి, యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అప్పలస్వామి, సెట్రాజ్ మేనేజర్ కెఎస్‌వి.కాశీవిశ్వేశ్వరరావు, న్యాయ నిర్ణేతలు, సెట్రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.



జెసి ఇలాక్కియాను సత్కరిస్తున్న సెట్రాజ్ అధికారులు

విజేతలు వీరే..

జానపద నత్యం (గ్రూపు)లో భవ్య గ్రూప్ ప్రథ, యామిని గ్రూప్ ద్వితీయ స్థానం, మధు గ్రూప్ తతీయ స్థానం సాధించాయి. జానపద నృత్యం (సోలో)లో పి.జాహ్నవి, ఎస్.దేవితేజస్వి, టి.లక్ష్మీశ్రావణి వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. జానపద గేయాలు(గ్రూపు)లో లావణ్య గ్రూప్ ప్రథమ స్థానంలో నిలిచింది. జానపద గేయాలు సోలోలో ఆర్.సాయిప్రసీద ప్రథమ, వివివిఎస్ఎస్ఎస్.హరిణి ద్వితీయ, వి.సాహితి తతీయ స్థానంలో నిలిచారు. కథా రచనలో జి. దవీత్, పోస్టర్ తయారీలో మహ్మద్ సమీర్, ఫోటోగ్రఫీలో బి.శైలేంద్రకుమార్, ఉపన్యాసంలో ఎన్.కుందన్‌సుష్మాసాయి, ఇ-గవర్నెన్స్‌ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎన్. కుందన్ సుష్మాసాయి, యాప్‌లలో ఎస్.పావనిగాయత్రి, పర్యావరణ రక్షణపై వ్యాస రచన పోటీలలో పి. మనోహర్ విజేతలుగా నిలిచారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

గ్రామాల్లోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండలం ఏటుపట్టు గ్రామాల్లో లబ్ధిదారులందరికీ ఆయా ప్రాంతాల్లోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని సిపిఎం బందం విజ్ఞప్తి చేసింది. ఏలేరు పరివాహక ప్రాంతంలోని 11 గ్రామాలకు సంబంధించి 1,980 మంది ఇల్లు లేని లబ్ధిదారులకు 18 కిలోమీటర్ల దూరంలో ఉన్న రామేశంమెట్ట సమీపంలో మూడేళ్ల క్రితం ఇచ్చిన ఇళ్ల పట్టాల ప్రాంతాన్ని బుధవారం సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల క్రితం పట్టాలిచ్చిన ప్పటికీ నేటికీ ఈ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. లబ్ధిదారులందరూ వారి సొంత గ్రామాలలో వ్యవసాయ పనులు చేసుకుంటారన్నారు. వారందరికీ 18 కిలోమీటర్ల దూరంలో ఇళ్ల పట్టాలు ఇస్తే ఎన్నో అవస్థలు పడతారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా ఆయన దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు, సిరపరపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్థలాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

తోటపేటలో 'గడప గడపకూ...'

ప్రజాశక్తి - తాళ్లరేవు

పోలేకుర్రు పంచాయతీ తోటపేట, బిసి పేట, పోలేరమ్మ గుడి ప్రాంతంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్ పాల్గొన్నారు. తోటపేటలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డుకు ఇరుపక్కల గ్రావెల్ వేయాలని ప్రజలు కోరారు. వెంటనే ఎంఎల్ఎ కాంట్రాక్టర్‌తో మాట్లాడి గ్రావెల్ వేయాలని ఆదేశించారు. సురక్షితమైన తాగునీరు అందించాలని మహిళలు కోరారు. సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మారుతీరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధా, ఎంపిటిసి సభ్యులు బల్ల సంధ్యారాణి, ఎంపిపి రాయుడు సునీత, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు కాదా గోవింద కుమార్, రాయుడు గంగాధర్, ధూళిపూడి బాబి, కొపనాతి నాగరాజు, దున్నా శ్రీకాంత్, భూసారపు పద్మారావు, ఉప సర్పంచ్ దడాల గణేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వడ్డి ప్రసాద్‌కు పలువురి పరామర్శ

చాగల్లు : కడియం పోలీసులు దాడిలో గాయపడిన కుంకుడుమిల్లికి చెందిన వడ్డే వెంకట ప్రసాద్‌ను జనసేన పార్టీ నాయకులు టివి.రామారావు బుధవారం పరామర్శించారు. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి కారకులను కఠినంగా శిక్షించాలని రామారావు డిమాండ్ చేశారు.

అన్నవరం కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- చాగల్లు

ఊనగట్లకు చెందిన జనసేన పార్టీ కార్యకర్త కొండేపర్తి అన్నవరం మాతృమూర్తి మరణించడంతో పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి టివి.రామారావు అన్నవరం కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఊనగట్ల నాయకులు ఏపుగంటి వెంకన్న, ఏపుగంటి నాగబాబు, కొయ్యలమూడి తేజ, బొరుసు శ్రీను, బొరుసు మణికంఠ, చాగల్లు నాయకులు కనాజీ రామాంజనేయాలు, రాగిరెడ్డి దుర్గ భూషణం, బిక్కిన సురేష్ చౌదరి, రాంబాబు పాల్గొన్నారు.

యానాం వార్తలు

సిఎస్‌ఆర్ నిధులతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో సిఎస్‌ఆర్ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ బుధవారం తెలిపారు. ఈ మేరకు సిఎస్‌ఆర్ నిధులు మంజూరు చేసేందుకు సిఎస్‌ఆర్ కమిటీ ఆమోదించిందన్నారు. 18 పనులకు సంబంధించి రూ.2.47 కోట్లు, 33 అభివద్ధి పనులకు సంబంధించి రూ.19.50 కోట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అదనంగా మరికొన్ని పనులకు రూ.2.30 కోట్లు ఇవ్వడానికి సిఎస్‌ఆర్ కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. గతంలో చేపట్టిన నిరవధిక దీక్ష వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా సిఎస్‌ఆర్ కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

సొసైటీ భూమి పట్టాదారులకు త్వరలో ఒఎన్‌జిసి నష్టపరిహారం

ప్రజాశక్తి - యానాం

స్థానిక దరియాలతిప్ప గ్రామంలో ఉన్న ఎస్‌సి ఫీల్డ్ లేబర్ సొసైటీ భూమి పట్టాదారులకు ఒఎన్‌జిసి ద్వారా రావాల్సిన నష్టపరిహారం త్వరలో మంజూరు చేయనున్నట్లు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ తెలిపారు. ఈ మేరకు పెండింగ్లో ఉన్న సుమారు 19 మంది పట్టాదారులకు నష్టపరిహారం త్వరలో తమ బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామన్నారు.

టిడిపితో మహిళలకు బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

టిడిపితోనే మహిళలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు పేర్కొన్నారు. టిడిపి నిర్వహిస్తున్న భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మహాశక్తి చైతన్య రథయాత్రను 26వ డివిజన్‌లో బుధవారం నిర్వహించారు. ఆయన పాల్గొని ఇంటింటా తిరిగారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ, మినీ మేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ రాబోయే టిడిపి ప్రభుత్వంలో మహిళల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ చంద్రబాబు నాయుడు మహాశక్తి పథకాలను ప్రకటించారన్నారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన, రక్షణ టిడిపి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. వైసిపి ప్రభుత్వంలో మహిళలపై దాడులు పెరిగి, రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, చిక్కాల సత్యవతి, అన్సార్, పంతాడి రాజు, సంఘాని నాగూర్, చింతా పేర్రాజు, సంఘాని గంగాధరం, కొల్లు ప్రకాష్, సంఘాని నూకరాజు, ఆదినారాయణ, పాలెపు రాజు పాల్గొన్నారు.

టిడిపి అసత్య ప్రచారాలు తగదు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

వేమవరంలో ఈనెల 22న మాజీ మంత్రులు బండారు సత్యనారాయణ సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నవారంతా వైసిపికి చెందిన వారేనని చేస్తున్న ప్రచారం సత్య దూరమని జడ్‌పిటిసి ఎలిశెట్టి అమృత, నరేష్ దంపతులు తదితరులు తీవ్రంగా ఖండించారు. బుధవారం పి.వేమవరంలోని వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ముసిరెడ్డి రాంబాబు, ముసిరెడ్డి శ్రీరాములు ఇద్దరూ స్థానిక ఎన్నికల్లో జనసేన తరపున పనిచేశారన్నారు. దీనికి సంబంధించిన ఫోటోలు సమావేశంలో ప్రదర్శించారు. వైసిపికి చెందిన వెయ్యి మంది టిడిపిలోకి చేరినట్లు చేస్తున్న ప్రచారం వాస్తవం కాదన్నారు. ఈ సమావేశంలో సర్పంచి ఎలిశెట్టి నూకరత్నం, మాజీ సర్పంచ్ ఎలిశెట్టి భీమన్న దొర, ఎంపిటిసి సభ్యులు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు గొల్లపల్లి వితరణ

కడియం : కడియం జెడ్‌పి పాఠశాల ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ, తన తల్లి గొల్లపల్లి నూకమ్మ జ్ఞాపకార్థం వసతిగృహం విద్యార్థులకు రూ.6 వేల విలువైన నిత్యావసర వస్తువులను అందజేశారు. పదో తరగతి విద్యార్థి హేమకు సైకిల్‌ను బహూకరించారు. అత్యధిక మార్కులు సాధించిన ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలను అందించారు. పాఠశాల ఆయమ్మలకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన గొల్లపల్లి దంపతులను పాఠశాల హెచ్ఎం టి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు రాజు, డేవిడ్, సువర్ణవేణి, గిరిజ పాల్గొన్నారు.

హౌసింగ్ రుణాలపై నిలదీత

ప్రజాశక్తి -కరప

హౌసింగ్ రుణాలు అందించకపోవడంపై పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. కరప మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల ప్రజాపరిషత్ చంద్రన్న సమావేశం భవనంలో ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎంపిడిఒ కె.అప్పారావు మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. పాతర్లగడ్డ సర్పంచ్ వాసిరెడ్డి ఏసుబాబు మాట్లాడుతూ హౌసింగ్ లబ్ధిదారులుకు ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం అందట్లేదని తెలిపారు. దీనిపై అధికారులను నిలదీశారు. ఎంపిడిఒ మాట్లాడుతూ 'సాయం విషయమైన ప్రజలకు ఎటువంటి హామీ ఇవ్వొద్దని, హౌసింగ్ అధికారులను సంప్రదించాలి' అని అన్నారు. దీంతో సర్పంచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సర్పంచులను సమావేశపరిచి హౌసింగ్ రుణాలు ఇస్తారు, ఇళ్లు కట్టుకోవాలని లబ్ధిదారులను ప్రోత్సహించాలని చెప్పారన్నారు. ఇప్పుడు అధికారులను సంప్రదించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు వై.సుబ్బారావు, ఎంఇఒ బులి కృష్ణవేణి, తహశీల్దార్ పొన్నమండ శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ ఎఇ ఈశ్వర్‌ప్రసాద్, అగ్రికల్చర్ ఎఒ రాజేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పూర్తికి కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట జగనన్న లే-అవుట్‌లో ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నిర్దేశించిన పనులన్నింటినీ ఈనెల 28 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం స్థానిక జి.రాగంపేట రోడ్డులోని ఇటిసి లేఔట్‌లో గృహ నిర్మాణాలు, ఇతర పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ఆమె మాట్లాడుతూ శాఖల సమన్వయంతో పనులను పూర్తి చేయాలన్నారు. ఈ పనులను ఆయా శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. పలు సూచలను చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ బి.సుధాకర్‌పట్నాయక్, డిఆర్‌డిఎ పీడీ కె.శ్రీరమణి, మెప్మా పీడీ బి.ప్రియంవద, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, ఆర్‌డిఒ ఎన్‌వివి.సత్యనారాయణ, డిఎల్‌డిఒలు పి.నారాయణమూర్తి, ప్రసాదరావు, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, తహశీల్దార్ ఎస్.లక్ష్మీనరసకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు అధికారులను ఆదేశించారు. స్థానిక 9వ వార్డు పరిధిలోని పద్మనాభ కాలనీలో బుధవారం వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వైస్ చైర్మన్ స్పందిస్తూ ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పి.సత్తిబాబు, టి.సత్యభాస్కరరావు, వి.రాజా, ఎ.వీరరాఘవ, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ కృష్ణ, జీవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలపై అవగాహనను పెంపొందించుకోవాలని సామర్లకోట ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు పేర్కొన్నారు. బుధవార బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ముద్రించిన పోస్టర్లను హెచ్ఎం, ఎస్ఐ తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ టివి.రత్నం, గంగాధర్, వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, వి.రాజు, జి.గోవిందు, కె.అరుణ, ఎఎల్‌వి.కుమారి, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.